తొలిసారీ, కడసారీ

[కథానిక]

శ్రీ కొడవటిగంటి కృష్ణమూర్తి

"అయితే వెళ్లనా?" అన్నది రాజమ్మ జడ చివరభాగం, సన్నాయి వాయించినంత త్వరగా పూలుతో అల్లుతూ.

"అయితే వెళ్లద్దు!" అన్నాడు సత్యం చూస్తున్న వేపే చూస్తూ.

"ఏం?"

"అసలు ఎవరిది వివాహం?"

"మా సుబ్బులు తమ్ముడిది. మా మేనత్త మనమడిదన్న మాట."

"నువ్వు వెళ్లక పోతే అనుకునిపోయే వా రెవరన్నా వున్నారా?"

"మా మేనత్త అనుకోదా, మరి మా మేనత్తకూతుర నుకోదా?"

"ఏమనుకుంటారు?"

"అయిన వాళ్లు రాలేదని!"

అనుకుంటే యిబ్బంది ఏమిటో సత్యానికి అర్థం కాలేదు. ఎందు కర్థ మవుతుంది? అతన్ని చిన్నప్పు డెవరూ దేనికీ పిలిచిన వాళ్లు కారు. అతని ఇంట్లో ఏకార్యాలూ ఇంతవరకూ జరగలేదు. ఇప్పట్లో జరిగే అవకాశంకూడా లేదు! అందుకని అతని ఇంటి

"అయితే, నువ్వు వెళ్లక తప్పదా" అని సత్యం రాజమ్మవైపు చూశాడు.

కెవ్వరూ రానక్కరలేదు! అందువల్లనే ఏదన్నా శుభానికి ఎవ్వరూ రాకపోతే ఎలా వుంటుందో అతను వూహించలేని స్థితిలో వున్నాడు. పోనీ, అతను రాకపోతే పోయినా డనుకుంటే, తన భార్యనుకూడా ఎక్కడికీ వెళ్లద్దంటాడు. తన చుట్టాలింటికి ఆమెను పంపకపోతే పోయినా డనుకుంటే, ఆమెచుట్టాలింటికికూడ ఆమ్మెను పంపటానికి అతనికి అభ్యంతరం వున్నట్టు తేలింది. ఒకసారి తన భార్యను చిన్నప్పటినుంచి పెంచి తనకిచ్చి వివాహంచేసిన తన భార్యపెత్తండ్రి కుమారుడి వివాహానికి ఆమెను పంపకపోతే జరిగిన గోల అతనికి జ్ఞాపకం లేదు! తన భార్య ఆ పెళ్లి అయిదు రోజులూ తిన్నగా అన్నమైనా తినని సంగతి అతనికి తెలియదు! అతని మనస్సు ఎవ్వరికీ అర్థంకాదని అతనికి విసుగు! అతనుగాని, అతని భార్యగాని ఎక్కడికైనా వెళ్లటానికి అతని కేమీ అభ్యంతరం లేదనీ, కాని వెళ్లకపోతే అందరూ ఎందు కింత అనుకోవాలనీ అతనికి ఆశ్చర్యం!

"అయితే నువ్వు వెళ్లకతప్పదా?" అని ఆమెవైపు చూశాడు.

"మీయిష్టం! మీరు వెళ్లమంటే వెళ్తాను."

"మళ్లీ ఎప్పుడొస్తారు?"

"రేపు పొద్దున్నే!"

"వెళ్లు! నాకెందుకు మధ్య!"

"అయితే మీరు రారూ?"

"ఊహు!"

"ఏం?"

"మీవాళ్లింటికి నిన్ను పంపటానికి నాకు అభ్యంతరం వుండటానికి ఎట్లా వీలు లేదో అట్లాగే మీవాళ్లింటికి నేను ఎందుకు రానని అడగటానికి నీకుగాని, నీవారికిగాని అధికారం లేదు."

అందరుచుట్టాలూ కలిసినప్పుడు తన భర్త అందరితోనూ కలియకపోవటం రాజమ్మకు కొత్తగాదు. తమ కుటుంబమంతా కలిసి గ్రూపుఫోటో తీయించుకున్నప్పుడు—ఎప్పుడో వెనక—తనభర్త అందరూ ఎంత బతిమాలినా వుండకపోవటం ఆమె మరిచిపోలేదు. ఆఫోటో చూచినప్పుడల్లా "ఒక్క సత్యంకూడా ఇందులో వుంటే ఎంతఆనందంగా వుండేది-వుండాలిసినవారంతా వున్నారు" అని తనచుట్టాలు మరిమరి అనుకున్న సంగతి తన చెవులలో ఇంకా మారుమోగుతూనే వున్నది. అదీగాక అందరితోపాటు అందరిలోకీ వెళ్లితే, అందరూ "సత్యం రాలేదేం?" అని ఆదుర్దాగా ఒకర్ని ఒకరు ప్రశ్నించుకోవటానికి అవకాశం లేదని తన భర్త గట్టి నమ్మకమని ఆమెకు ఇదివరకు అనుమానమే వుండేది. ఇప్పు డది స్థిరపడింది. ఎక్కడికైనా వెళ్లటానికి తనకు ఏమీ అభ్యంతరం లేదని తనభర్త ఎంత చెప్పినా, వెళ్లకపోతే వున్న మజా, మర్యాదా వెళ్లితే వుండవని ఆయన నమ్మకమని ఆమెకు ఈసారితో తేలిపోయింది. అటువంటి విషయం ప్రతిదినం ఆయనతోపాటు సంసారాన్ని యీదుతూన్న భార్యకే తెలుస్తుంది. పరాయివాళ్లకు ఎట్లా తెలుస్తుంది? మొత్తం మీద రాజ్యం "అమ్మా!" అనుకుంది,

"ఒక్కపూటేగా? మీరుకూడా రండి!" అన్నది రాజమ్మ చీరెలు పెట్టెలో సర్దుకుంటూ.

"ఒక్కపూట పెళ్లికిన్ని చీరె లెందుకూ?"

భర్త ప్రశ్నకు సమాధానం చెప్పటం రాజమ్మకు చేతకాకపోయినా ఆమె కెందుకో ఆ ప్రశ్న అసహ్యం కలిగించింది!

"మీరుకూడా రండి!" అన్నది అన్నిటికీ సమాధానంగా.

"నా దేమిటిలే! నువ్వు వెళ్లుదూ!"

"మీరు ఎప్పుడూ ఎక్కడికీ రాలేదు కదా! ఈసారన్నా రండి, మావాళ్లు సంతోషిస్తారు!"

"నేను రాను లే!"

* * *

ఆ సాయంత్రం మూడింటికే తనభార్య చుట్టం ఎవరో వచ్చి రాజమ్మను బండి ఎక్కించి తీసుకెళ్లాడు. వచ్చినాయన సత్యాన్నికూడా రావలిసిం దని కోరాడు. సత్యం సణిగాడు. రాత్రి ఎనిమిదిన్నరకు లగ్నమనీ, సత్యానికి ఈలోపలే పని అయిపోతే సాయంత్రంబండికి వచ్చినా లగ్నానికి అందుకుంటా డనీ జ్ఞాపకంచేసి, పోతూపోతూ స్టేషనుకు పెళ్లివారిల్లు ఎక్కువదూరం కాదని కూడా చెప్పి వెళ్లాడు.

౨

ఆ సాయంత్రం కాఫీ తాగి కారాకిల్లీకి ఆర్డరిచ్చి, కట్టేలోపల అతను కూనిరాగంతీస్తుండగా ఎవరిదో ఆడవాళ్ల వూరేగింపు అతని ముందరగా వెళ్లటం జరిగింది. ముందు బాండు, వెనక దాదాపు ఒక పాతికమంది స్త్రీలు రకరకాల చీరెలు కట్టుకుని పోతున్నారు. ప్రతిస్త్రీ సబ్బుతో ముఖం బాగా కడుక్కుని ఫేసుపౌడరు కొట్టుకుని వుంది. వీళ్లమధ్య అక్కడక్కడ చెరువులో తామరాకులల్లే మాసిన బట్టలు కట్టుకుని దాసీలు పెద్దపెద్ద పళ్లాలలో లడ్డూలు, పూస మొదలయిన తినుబండారాలు నాజూకుగా పేర్చి నడుస్తున్నారు. సత్యానికి ఏదో ఆలోచన కలిగింది. వెంటనే కిల్లీలవాడు పిలిచి కారాకిల్లీ చేతిలో పెట్టాడు. అది కొంచెము నమలి వుమ్మేసిన తరువాతగాని అతనికి తట్టిన ఆలోచన "తను పెళ్లికివెళ్లితే ఎట్టా వుంటుంది" అని జ్ఞాపకం రాలేదు. ఆడవాళ్ల వూరేగింపు మలుపు తిరిగింతరువాత "వెళ్లాలిసిందే" అని నిశ్చయించుకున్నాడు. ఎప్పుడూ వెళ్లకపోయినా మజాలేదు మరి! ఎప్పుడైనా ఒకసారి వెళితేగాని మళ్లీ రాలేదని అనుకుంటూ వుండరేమో! అదికాక ఇటువంటి దూరపు (తనకు ఏమీ సంబంధంలేని!) చుట్టాలింటికి వెళ్లితేనే కడంవాళ్లు "అవును, మీరు వారింటి కెళ్లుతారుగాని మా యింటికి వస్తారుటలెండి!" అని కుములటానికి అవకాశం వుంటుంది. మరో ముఖ్యమైన విషయం — "సత్యంగారు ఎంత మంచివారు! ఎక్కడికీ వెళ్లరు, మాయింటికి వచ్చారు" అని చెప్పుకుంటారు. పైపెచ్చు ఏ దగుల్బాజీఅన్నా "ఎక్కడికీ ఆయన రాడే" అని కూస్తే తను ఫలానిచోటికి వేంచేసినట్టు రిజిష్టర్డుడాక్యుమెంటు ప్రొడ్యూసు చెయ్యచ్చు. వెళ్లకవెళ్లక దూరపువారింటికి వెళ్లితే జరిగే మర్యాదలో వున్న మజాలోని మైనరుడిటెయిల్స్ అతనికి ఒక్కొక్కటే జ్ఞాపకానికి వస్తూన్న మొహం పెట్టి

"ఏమయితే ఏం, ఇంకా గంట ఆలస్యముంది" అని తేల్చుకున్నాడు.

ఎందుచేతనో అతనికి వెళ్లాలని నిశ్చయించుకున్నప్పటినించీ ఆదుర్దా ఎక్కువైంది! ఆమరుక్షణం అతను తనభార్య మేనత్తమనమడికి కాబోయ్యే అత్తగారింటో వుంటే ఎంతబాగుండేది! ఎట్లాగైనా అందరూ తనని మర్యాదచేయటానికిగాని, తాను చేయించుకోటానికిగాని ఒక్కపూట ఏంసరిపోతుంది ? పైగా రాత్రిపూట! అంతా అయి భోజనాలయేటప్పటికే ఒంటిగంట అవుతుందే? ఆ తర్వాత ఎవరికి వారు నిద్రపోవటమో, లేక ఇళ్లకు ప్రయాణమయ్యే ప్రయత్నంలో వుండటమో జరుగుతుంది గాని అందరూ చుట్టూ చేరి, "వచ్చారా!"అన్న భావంతో చిరునవ్వు నవ్వే అవకాశం ఏదీ? పెళ్లిఅయిదురోజులూ అయితే చాలాబాగుండేదని వేరే చెప్పనక్కర్లేదు. అయినా అయిదురోజుల మర్యాదలో మజా లేదు. రెండురోజు లయ్యేటప్పటికి స్టేల్ అయిపోతుంది. కాని అయిదురోజులయితే మధ్య మూడోనాడో నాలుగోనాడో అందరూ ఎంత బతిమాలినా వినక వచ్చేసి వాళ్లదుంప తెంపటానికి అవకాశం వుంటుంది మరి! ఇప్పుడు ఒక్కపూట పెళ్లిఆయె! యిహ వాళ్ల దుంప తెంపాలంటే భోజనాలు కాక పూర్వం "వెళ్లుతున్నా" నని బయలుదేరాలి. అట్లా చేస్తే వాళ్లు దుంపతెంచుకోకపోగా వెళ్లేవాడి నోట్లో వుమ్మేయటానికికూడా అవకాశం వుంది! పోనీ, భోజనా లయిన తర్వాత బయల్దేరితే, ఎవ్వరూ వుండమని బతిమాలే ఛాన్సు కాదాయె. మహా కోరితే, తర్వాత ఎప్పుడన్నా ఒకసారి రమ్మంటారు. మొత్తంమీద డబిట్ క్రెడిట్ సమానమన్నా కాలేదు. సత్యానికి దిగులు పుట్టింది. కర్తవ్యం ? టైము చూశాడు. రైలుకు అరగంట వుంది. వెళ్లటమా, వెళ్లకపోవటమా ? స్నానం చేస్తూ ఆలోచిద్దామనుకున్నాడు. మొదటిబొక్కెన నీళ్లు శరీరానికి తగలగానే ఏమయితే అయింది, వెళ్లితీరాలని సంకల్పం కలిగింది. పూజా పురస్కారాలు లేక బూజెక్కి ఉన్న అతని ప్రాణి, పాపం, వాటికోసం ఎంతతపిస్తున్నదో!

స్నానం పూర్తి చేసి చలవచేసిన బట్టలు కట్టుకుని గుర్రంబండి ఎక్కి స్టేషను చేరి, గుంటూరికి టిక్కెట్టు తీసుకొని రైలు పెట్టెలో కూలబడేటప్పటికి రైలూ కదిలింది, సూర్యుడు మరో ప్రాంతం చేరుకున్నాడు. రైలు తప్పేదే! పైన భగవంతుడు లేడూ!

3

ఒక గంటలో రైలు గుంటూరుచేరింది. అందరితోపాటు సత్యం టిక్కెట్టు ఇచ్చేసి బయటికి వచ్చాడు.

"బండి కావాలా మహరాజ్!"

అని సాయిబు అడిగేటప్పటికి సత్యానికి ఎక్కడికి వెళ్లాలిసిందీ తెలియదని తెలిసింది! అతనిమనస్సు ఎందుచేతనో ఎక్కడికి వెళ్లాలో తెలియకపోతే ఎంత ఇబ్బందో గ్రహించ లేదు వెంటనే. బండీవాడు మళ్లీ అడిగేటప్పటికి అతనికి తన భవిష్యత్తు అర్థమయింది. బండి కావాలి! కాని ఎక్కడికి ? పెళ్లివా రింటికి! పెళ్లివారిల్లు ఎక్కడ? స్టేషనుకు మెక్కువ దూరం లేదు! ఎన్నడూ ఎక్కడికీ వెళ్లనికారణంచేత తన చుట్టాల ఇళ్లుకూడా తెలియవు సత్యానికి. పెళ్లివా రింటికి అని చెప్పి బండి ఎక్కేటంత మూర్ఖుడైనా బాగుండేది సత్యం.

పాడు తిప్పితిప్పి గూబలుమెలేసి వాడికి కావలి సిన డబ్బు వసూలుచేసేవాడు బండివాడు!

"ఏమండీ చెప్పరు, మారాజ్ !"

కావల్ననిగాని, అక్కర్లేదనిగాని త్వరగా చెప్పాలని సత్యానికి అసహ్యంగా అర్థమయింది. ఏమయితే ఏం, "అక్కర్లేదు" అన్నాడు. పంతులుగారు ఏదో ఆలోచిస్తున్నారనుకుని బండివాడు కొంచెము ప్రపంచం చూసినవాడు కావటంచేత అయిదునిమిషాలు అక్కడేనిలుచుని సత్యానికి ఆలోచించుకోటానికి అవకాశం యిచ్చి మళ్లీ అడిగాడు.

"బండి కావాలి కాని —" వెంటనే ఆపాడు సత్యం, ఎక్కడికి వెళ్లాలో తనకు తెలియదని చెప్పటం ఇష్టంలేక.

"మంచి గుర్రం మారాజ్! బాగా పోతేనే డబ్బులు ఇయ్యండి" అన్నాడు బండివాడు.

"నాకు అక్కర్లేదోయి!" అన్నాడు చివరకు సత్యం.

బండివాడు ఒక్కక్షణం సత్యంవంక చూసి లుంగీవిప్పి మళ్లీకట్టుకుని వెళ్లిపోయి బండికాస్తా రైలుకాంపౌండుచివరనిలబెట్టాడు. వాడికి ఆశవదలకపోగా ఆశ ఎక్కువయింది. ఏపిల్లదానింటికో వెళ్లే చెయ్యి అనీ, తనకు అధమం అర్ధరూపాయి అయినా ముట్టుతుందనీ వాడికి గట్టినమ్మకం కలిగింది. అటువంటి మనుష్యుల్ని తొందరపెట్టకూడదని వాడికి తెలుసు!

సత్యంఅవస్థ సత్యంది! రాత్రి ఎనిమిది గంటలు కావస్తున్నది. తనస్థితి వర్ణించటం ఏకవికి చాతవుతుంది? పెళ్లి వారిల్లు ఎక్కువ దూరంలో లేదని అతనికి తెలుసు. కాని ఎక్కడో తెలియదు. పోనీ, యింటివారి పేరయినా తెలుసునా అంటే, అదీ తెలియదు! గుంటూరు తనకు పాతదైనప్పటికీ పెళ్లి వారిల్లు అతనికి అందరాని దయింది. రైలుస్టేషనుకు ఎక్కువదూరంలో లేని యిళ్లు ఎన్నని వెతుకుతాడు? పైగా ఏమైపని? సత్యానికి ఏదో ఆవేదన కలిగింది. తన ఎదుట తను లేకుండా అరగంటలో తనచుట్టాలఇంట్లో పెళ్లి జరగబోతున్నది. తను ఎన్నడూ వెళ్లకవెళ్లక వెళ్లటమేమిటీ, చివరకు నిజంగానే వెళ్లలేక పోవటమేమిటీ? తను గుంటూరువచ్చినట్టు ఎవరికీ తెలియకపోయినప్పటికీ, ఒకవేళ తెలిసినా పెళ్లికివెళ్లినట్టూ, ఇల్లుతెలియక వెళ్లకపోయినట్టూ ఎవరికీ తెలియకపోయినా అతనికి ఈస్థితి రుచించలేదు. అతనికి చెప్పలేని వ్యక్తులందరిమీదా ఏకారణంచేతనో మండింది. తన కింత పరాభవం! ఏమైతే అయింది, పెళ్లివారిల్లు కనుక్కోవా లనుకున్నాడు. కాని అతని తరమా?

ఇల్లు తెలిసింతరువాత ఈయిల్లు కనుక్కోలేకపోయినా మేమి టని అందరికీ ఆశ్చర్యం వెయ్యొచ్చుకాని తెలియకముందు అది తెలుసుకోవటం ఎంతకష్టమో సత్యానికర్థమయింది. ఎవరో మీకోసం వచ్చారని చెప్పినప్పుడు ఎవరో తెలియక ఎట్లా వున్నాడనీ, అవీ ఇవీ అడిగి, తర్వాత వచ్చిందెవరో తెలిసింతరువాత "ఓరినువ్వా?" అని అంటాము. వున్న సంగతి అది!

పెళ్లివారిల్లు బ్రాడిపేటలోనో, లేక అరండలుపేటలోనో, లేకున్న ఈ రెంటిమధ్య

నో వుంటుందని సత్యం విధిలేక అనుకోవలసి వచ్చింది! వెంటనే బయల్దేరాడు.

“ఎక్కండి, మహారాజ్!” అని, అంత వరకూ బండిలో పడుకుని సత్యాన్ని చూస్తున్న బండివాడు, సత్యం బండిదగ్గిరికి రాగానే అన్నాడు.

“నా కక్కర్లేదు!” అని సత్యం నడచి వెళ్ళిపోయినాడు. సత్యం అరండలుపేట హైవేదారి తొక్కటంవల్ల వదిలిపెట్టాడు గాని వూరివేపు తొక్కితే వెంటబడే వాడే బండివాడు!

సత్యం ఎక్కడికి వెళ్ళాలో తెలియకపోవటంవల్ల నెమ్మదిగా నడుస్తూ థియోసాఫికల్ లాడ్జిదగ్గరకు చేరుకున్నాడు. అక్కడికీ, రైలు గేటుకూ మధ్య వుండటానికి అవకాశం లేక పోలేదు పెళ్ళివారిల్లు! కొంచెం మళ్ళీ వెనక్కి వచ్చి అరండలుపేటలో ప్రవేశించాడు. రెండు అడ్డురోడ్లు దాటేటప్పటికి ఒక ఇంట్లో గాస్ లైట్లూ అవీ వెల్తురుగా వున్నాయి. ఎవరో ఒకాయన బయటికి వచ్చాడు. వాకిలి కెదురుగ్గా సత్యాన్నిచూచి “పదరేం? లగ్నం జరుగుతుంటే!” అన్నాడు. సత్యం కొంచెము అనుమానంతోనే లోన ప్రవేశించాడు. హడావిడిగా వుంది. చుట్టూ జనం, మధ్య గుడ్డ అడ్డంగా పట్టుకుని పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ కూచున్నారు. మొహాలన్నీ పరికించి చూచాడు. తనభార్యవైపుచుట్టాలు ఒక్కరూ కనపడలేదు. పెళ్ళిచేయించే ఆయన సత్యంవంక చూచాడు. ఆయనకు తెలియని వ్యక్తి గావటంవల్ల ఆయనధోరణిలో ఆయన వున్నాడు. సత్యానికి చొక్కా వుత్తరీయాలు లేకుండా ఏగావంచో వుంటే కూచోమనే వాడే, అధమం సంభావనకోసమన్నా! పెళ్ళివారిల్లు కావటంచేత ఎవ్వరూ అతన్ని ఎరగకపోవటంవల్ల ఏమీ అనలేదు. చప్పుడు కాకుండా బయటికి వెళ్ళాడు!

ఏమయితే అయింది, నడవటం మొదలు పెట్టాడు. కొంతసేపటికి మళ్ళీ పెళ్ళివారింటిలాంటిది కనిపించింది. ఈతడవ వీధివాకిట్లోనించే చూచాడు లోపలికి. పెళ్ళికొమారుడు భార్యకు తాళి కట్టుతున్నాడు. అయిదు నిమిషాలు జాగ్రత్తగా పరకాయించాడు స్త్రీపురుష విచక్షణ లేకుండ! ఎక్కడా ఎవ్వరూ కనిపించలేదు. అసలు పోలికే లేందే!

మళ్ళీ నడవటం ప్రారంభించాడు. ఆ రోడ్డుచివరదాకా వెళ్ళాడు. ఏమీ అంతు చిక్కలేదు. పక్కరోడ్డు పట్టాడు. కొంత దూరం నడవగానే ఇంకో పెళ్ళియిల్లు కనపడ్డది. సత్యం అదృష్టంకొద్దీ పెళ్ళిళ్లు అన్నీ ఆరోజునే జరుగుతున్నాయి! తొంగి చూచాడు బయటినించి. ఇక్కడకూడా సత్యాన్ని ఆదరించేవారు అగపడనేలేదు. తరువాత ఎన్ని బజారులు తిరిగినా అసలు లైటువున్న కొంపే కనపడలేదు. ఎవరికివారు భోంచేసి పడుకునే సమయం. పెళ్ళి పోతే పోయింది, భోజనాలకైనా అందుకుంటామా అని అనిపించింది.

ఇహ బ్రాడీపేట! మధ్యరోడ్డు దాటుతుండగా కనిపించింది మరొక పెళ్ళివారిల్లు. లోపల హడావిడిగావుంది. లోపలికి తొంగి చూచాడు. తగినవారికి యథాశక్తి సంభావన యిస్తున్నారు. బైట యిద్దరు నిలబడి వున్నారు. “లోపలికి దయచేయండి” అన్నారు. సత్యం కొంచెం దూరాలోచన చేసి, అక్కడినించే చూశాడు. ఎవ్వరూ

ఎతిగున్న ముఖంతో లేరు. "పెళ్లివారి దేవూ"రని ప్రశ్నించాడు. వాళ్లు "విశాఖ పట్టం" అని చెప్పారు. వెంటనే బయలు దేరాడు. రోడ్డు దాటి బ్రాడీపేటలో ప్రవేశించాడు. ఎంతదూరం పోయినా పెళ్లికొంపే కనపడలేదు. అరండలుపేటే నయం!

కొంతదూరం నడిచింతరువాత సత్యానికి విసుగూ, విచారం కలిగింది. తనదే పొరపాటు! చలికాలం కావటంచేతనూ, రాత్రివేళ కావటంచేతనూ సత్యానికి చలి కూడా బాధించటం మొదలుపెట్టింది. మూడు గంటలనించీ నడుస్తూవుండటంవల్ల కాళ్లు నొప్పులుగా వున్నయి. గుంటూరు దుమ్ము అతిశ్రేష్ఠమైనది కావటంవల్ల పాదాలు ఆ పదార్థాన్ని చేతనైనంతా స్వీకరించినై. ఈశ్వరుణ్ణి తలుచుకుంటూ ముఖం తుడుచుకున్నాడు వుత్తరీయంతో. వుత్తరీయానికి ముఖం ఎదురుతిరిగింది. గట్టిగా తుడిచాడు. ముఖాన అంటిన దుమ్మంతా వుత్తరీయానికి అంటుకుంది.

అతనికి ఆకలికూడా భరింపరానిదయింది. మొత్తంమీద బ్రాడీపేటచివరదాకా నడిచాడు. పన్నెండుగంట లయివుంటుం దనుకున్నాడు. ఇహ చాలు ననుకుని స్టేషనుకు చేరుకుందా మనుకున్నాడు. అయినా వచ్చినదారినే వెళ్లట మెందుకని పక్కరోడ్డు పట్టాడు. బ్రాడీపేటమొదటికి వచ్చేటప్పటికి ఒకయింటోనించి గాసులైటువెలుతురు ద్వారంగుండా వచ్చి వీధిమీదుగా ఎదుటింటి గోడమీదకి ఎక్కింది. అదీ పెళ్లివారిల్లే.

అంతా నిశ్శబ్దం. వాకిలిఎదురుగా ఆదీపపు వెలుగులో యానాదివాళ్లు ఇద్దరు బట్టలు పట్టుకు నిల్చున్నారు. ఎవరో బ్రాహ్మడు లోపల్నించి వచ్చి ఎంగిలాకుల విస్తళ్లన్నీ వాళ్లబట్టలో పడేశాడు. చుట్టూ చీకటి! పెళ్లివారింటోనించి గాస్‌లైటుచప్పుడు తప్ప ఏశబ్దమూ రావటంలేదు. అది నిజంగా తనచుట్టాలతాలూకు పెళ్లివారిల్లయినప్పటికీ సత్యానికి లోన ప్రవేశించటం ఇష్టంలేదు! కాళ్లీడ్చుకుంటూ స్టేషను చేరాడు.

స్టేషనులో గడియారంలో ఒంటిగంట కావస్తున్నది. ఇంకా నాలుగుగంటలు గడిపితే రైలు వస్తుంది. ఇంతలో అతనికి ఇంకో ఆలోచన వచ్చింది. పెళ్లివారుకూడా తెల్లారకట్ల రైలుకే బయలుదేరివస్తారు! తనను చూస్తే వాళ్లు ఏమనుకుంటారు! ఏమయినా, సత్యానికి ఎక్కడికీ వెళ్లే వోపికలేదు. తెలిస్తే తెలిసింది అనుకున్నాడు.

ఆచలిలో చల్లగావున్న బెంచిమీద ఏమినిద్ర పడుతుంది, అతనిస్థితిలో వున్నవాడికి? టైము యెలా గడిచిందో తెలియదు. నిద్రపోయినాడో లేదో అతనికి తెలియదు. అతను లేచేటప్పటికి స్టేషను స్వల్పంగా హడావిడిగా వుంది. వెళ్లి ప్లాటుఫారంమీద నిల్చుని చూశాడు. వెధవమొహం వేసుకుని రైలు గుంటూర్ని యెక్కుతున్నది! యెంచేతనో పెళ్లివా రెవ్వరూ అతనికి తగలలేదు. అసలు రైల్లో యెక్కిందే పదిహేనుమంది.

ముఖం కడుక్కుని, వూళ్లో కాఫీహోటలుల్లో తిని, పేపరు కొని కాఫీహోటలులోనే

చదివి, యెట్లాగైతేనేం చేతనైనంత ఫ్రెష్‌గా యెనిమిది గంటలకు ఇంటికి చేరుకున్నాడు. ఇల్లంతా హడావిడిగా వున్నది! పెళ్లివారే! కొత్తమొహాలూ పాతమొహాలూ కలిసి వున్నయి. మరుక్షణం రాజమ్మ కనిపించింది.

"మీరు యెప్పుడు వచ్చారు?" అన్నాడు సత్యం.

"తెల్లారకట్ల బస్సులో వచ్చాం! మేం వచ్చేటప్పటికి మీరు లేరే, యెక్కడికివెళ్లారు?" అన్నది రాజమ్మ.